ప్రజాశక్తి

గురువారం 14 నవంబర్ 2024 5 అనంతపురం

సమీక్ష సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

'అనంత'లో ఫుట్‌బాల్ సంబురం

◆ 15 నుంచి సంతోష్ ట్రోఫీ

◆ పాల్గొననున్న నాలుగు జట్లు

◆ ఏర్పాట్లపై జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ శర్మ సమీక్ష

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఇటీవలే జాతీయ స్థాయి ప్రతిష్టాత్మక క్రికెట్ టోర్నీకి అనంతపురం వేదికైన విషయం తెలిసిందే. తాజాగా ఫుట్‌బాల్ జాతీయ స్థాయి పోటీకి మరోమారు అనంతపురం వేదిక అవనుంది. ఈ మేరకు అనంతపురం నగరంలోని ఆర్డీటీ స్పోర్ట్సు కాంప్లెక్సులో ప్రతిష్టాత్మక సంతోష్ ట్రోఫీ నాలుగు రోజులపాటు జరగనుంది. ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకు జరుగుతున్న ఈ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్‌తోపాటు కర్నాటక, తమిళనాడు, అండమాన్, నికోబార్ జట్లు పాల్గొంటున్నాయి. ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ టోర్నమెంట్‌ను విజయవంతం చేయడానికి అవసరమైన ఏర్పాట్లను జిల్లా యంత్రాంగం చేపడుతోంది. దులీప్‌ట్రోఫిని విజయవంతంగా నిర్వహించనట్టు సంతోష్ ట్రోఫీని విజయవంతం చేయడానికి అవసరమైన ఏర్పాట్లపై దృష్టి సారించింది.

తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌కు..

సంతోష్ ట్రోఫీని ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా నిర్వహించే అవకాశం లభించింది. 40 ఏళ్లలో ఒక్కసారి కూడా రాష్ట్రంలో ఈ టోర్నమెంట్ నిర్వహించే అవకాశం రాలేదు. అనంతపురం నగరంలోని ఆర్డీటీ స్పోర్ట్సు కాంప్లెక్సులో ఫుట్‌బాల్ గ్రౌండ్స్ అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉండటంతో, మౌలిక సదుపాయాలు కూడా ఉండటంతో ఆల్‌ఇండియా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఈసారి ఈ టోర్నీని ఇక్కడ నిర్వహించడానికి అనుమతినిచ్చారు. ఇది వరకు జాతీయ స్థాయి బాలికల ఫుట్‌బాల్ టోర్నీ కూడా ఇక్కడ జరిగింది. ఇప్పుడు సంతోష్ ట్రోఫికి అనంతపురం జిల్లా వేదిక కానుంది. ఈ మ్యాచ్ ప్రారంభోత్సవానికి ఆల్ ఇండియా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు కళ్యాణ్ దుబే, రాష్ట్ర అధ్యక్షులు కోటగిరి శ్రీధర్‌లు హాజరవుతున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

ఎక్కడా లోటు లేకుండా ఏర్పాట్లు

శివనారాయణ్ శర్మ, జాయింట్ కలెక్టర్

తొలిసారిగా రాష్ట్రంలో జరుగుతున్న సంతోష్ ట్రోఫీని విజయవంతం చేయడానికి అందరూ కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ శివనారాయణ్ శర్మ తెలిపారు. టోర్నీ నిర్వహణపై బుధవారం నాడు కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫుట్‌బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ డేనియల్ ప్రదీప్, డీఎస్డీవో షఫి, ఆర్డీటీ ప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. స్పోర్ట్సు విలేజ్ విద్యుత్ సరఫరా మొదలుకుని వైద్య సదుపాయలు తదితర అంశాలన్నింటినీ లోటు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులకు జాయింట్ కలెక్టర్ సూచించారు.

ఫుట్‌బాల్ నిర్వహణపై సమీక్ష నిర్వహిస్తున్న జెసి శివ్‌నారాయణ్ శర్మ

ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూరేలా చర్యలు

కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల లబ్ధి అర్హులందరికీ చేరేలా లక్ష్యాలను 100 శాతం పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో బుధవారం నిర్వహించిన మెగా బ్యాంక్ లోన్ మేళా - 2024 (బ్యాంకు రుణ వితరణ కార్యక్రమం)లో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. అర్హత కలిగిన పేదలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల కింద లబ్ధి చేకూర్చాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు, రైతులు వారి కాళ్లమీద వాళ్లు నిలబడేలా ఆర్థిక సాయం పొందాలంటే ఎన్నో సవాళ్లను ఎదుర్కొనే పరిస్థితి ఉందన్నారు. ఇలాంటి తరుణంలో వారికి సులువుగా రుణాలు అందించేలా అవగాహన కల్పించాలన్నారు. లబ్ధిదారులు నేరుగా బ్యాంకులకు వచ్చి మేనేజర్‌తో మాట్లాడేలా వీలు కల్పించాలన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చేలా బ్యాంకర్లు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డిఎం నర్సింగరావు, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ జిఎం.శ్రీధర్, ఉద్యాన శాఖ డిడి నరసింహారావు, చేనేత జౌళి శాఖ ఏడీ శ్రీనివాసరెడ్డి, డీఆర్డీఏ పీడీ ఈశ్వరయ్య, పరిశ్రమల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాజశేఖర్ రెడ్డి, బ్యాంకర్లు, పారిశ్రామికవేత్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

18న కనకదాస రాష్ట్రస్థాయి జయంత్యుత్సవాలు

సెయింట్ కనకదాస రాష్ట్రస్థాయి జయంత్యుత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఈనెల 18 జరిగే సెయింట్ కనకదాస జయంతి వేడుకల నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు సెయింట్ కనకదాస జయంతిని రాష్ట్ర పండుగగా ఈనెల 18న జరుపుకోవాలన్నారు. రాష్ట్రస్థాయి వేడుకలు నవంబర్ 18వ తేదీ అనంతపురంలోని గుత్తి రోడ్డు కెటిఆర్ కన్వెన్షన్ హాల్ నందు జరుగుతుందని, ఈ కార్యక్రమానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు. గుత్తి రోడ్ సర్కిల్‌లో ఉన్న కనకదాస విగ్రహం ప్రాంగణంలో శానిటైజేషన్ ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమణమూర్తి, బిసి వెల్ఫేర్ డిడి కుష్బు కొఠారి, డిటిడబ్ల్యుఒ రామాంజనేయులు, డీఆర్డీఏ పీడీ ఈశ్వరయ్య, అనంతపురం అర్బన్ తహసీల్దార్ హరికుమార్, జిల్లా పరిషత్ సీఈవో వెంకట సుబ్బయ్య, మున్సిపల్ కమిషనర్ నాగరాజు పాల్గొన్నారు.

జెఎన్‌టియు ప్రిన్సిపల్ పి.చెన్నారెడ్డికి అభినందనలు

ప్రజాశక్తి -అనంతపురం

చెన్నారెడ్డిని అభినందిస్తున్న జెఎన్‌టియు సిబ్బంది

అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.చెన్నారెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఉత్తమ అధ్యాపక అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన్ను మెకానికల్ విభాగ అధిపతి డాక్టర్ కళ్యాణి రాధ, డాక్టర్ బి.ఓంప్రకాశ్, కంప్యూటర్ సైన్స్, విభాగం వైస్ ప్రిన్సిపాల్ ఎస్.వసుంధర, సి.శోభా బిందు, కె.మాధవి, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ కెఎస్.భారతి, డాక్టర్ లలిత కుమారి, డాక్టర్ సోమి చెన్నారెడ్డిలు సన్మానించి అభినందనలు తెలిపారు.

శ్రీరంగరాయల చెరువులో వైభవంగా తెప్పోత్సవం

పాల్గొన్న బండారు రవికుమార్, లీలావతి

ప్రజాశక్తి-శింగనమల

శింగనమల మండల కేంద్రంలోని శ్రీరంగరాయల చెరువులో బుధవారం రాత్రి తెప్పోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బండారు రవికుమార్, బండారు లీలావతి, బండారు కిన్నెరశ్రీ పాల్గొన్నారు. ప్రతి సంవత్సరం కార్తీక మాసంలో ఆనవాయితీగా తెపోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా వెంకటరమణ స్వామి, శ్రీదేవి భూదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలతో శ్రీరంగరాయుల చెరువులో తెప్పోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంబంధించి శివపార్వతుల పంచలోహ విగ్రహాలను లక్ష రూపాయల వ్యయంతో బండారు రవికుమార్, బండారు లీలావతి, బండారు కిన్నెరశ్రీ చేయించి శివాలయానికి ఇచ్చారు. ఈ వేడుకలను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు విచ్చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గుప్తా ఆదినారాయణ, మాజీ మండల కన్వీనర్ చితంబరి దొర, మాజీ జడ్పిటిసి అమ్మలదీన్నె శాలిని, రామాంజనేయులు, కాయల రమణ యాదవ్, బోయ సత్యనారాయణ, మాసుల చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అహుడా ఛైర్మన్ టిసి.వరుణ్ రాక

300 వాహనాలతో భారీ ర్యాలీ

ప్రజాశక్తి-అనంతపురం

జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు టిసి.వరుణ్ అహుడా ఛైర్మన్ హోదాలో గురువారం మొదటిసారి అనంతపురం నగరానికి వస్తున్నారు. దీంతో జిల్లా సరిహద్దుల్లోని బాటలో సుంకులమ్మ ఆలయం వద్ద నుంచి టిసి.వరుణ్‌కు స్వాగతం పలికేందుక జిల్లా జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, కూటమి నాయకులు 300 వాహనాలతో భారీ స్వాగత ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం ఉదయం 9:30 గంటలకు టిసి.వరుణ్ బాటలో సుంకులమ్మ ఆలయం వద్దకు చేరుకుంటారు. అక్కడి నుంచి భారీ కాన్వాయ్‌గా సోములదొడ్డి ఆంజనేయస్వామిసర్కిల్, శ్రీ7 కన్వెన్షన్ హాల్, గుత్తి రోడ్డు ఐదు లైట్ల సర్కిల్, పాతూరు గాంధీ సర్కిల్, శ్రీకంఠం, కొత్తూరు జూనియర్ కళాశాల, ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా క్లాక్ టవర్ చేరుకుంటారు. అక్కడ భారీ గజమాలతో వరుణ్‌కు స్వాగతం పలకనున్నారు. సప్తగిరి సర్కిల్, ప్రభుత్వాసుపత్రి, అంబేద్కర్ ఫ్లైఓవర్ మీదుగా అహుడా ఛైర్మన్ టీసీ వరుణ్ నివాసానికి భారీ ర్యాలీగా చేరుకుంటారు. మధ్యాహ్నం అక్కడ భోజనం ఏర్పాట్లు చేశారు. మరోవైపి టిసి.వరుణ్‌కు భారీ స్వాగతం పలికుతూ నగరంలోని ప్రధాన కూడల్లు, రహదారుల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

104 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్ర కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అంబేద్కర్‌కు విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న 104 ఉద్యోగులు

104 ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వారి సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సోమగట్ట నాగేంద్రకుమార్ డిమాండ్ చేవారు. 104 ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా పరిషత్ హాల్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి వద్ద ఏపీ 104 మొబైల్ మెడికల్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.నాగమణి, నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ ప్రజలకు అత్యవసర సేవలు అందిస్తున్న 104 ఉద్యోగులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. చాలీచాలని వేతనాలతో వారితో వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వీరి సమస్యలపై స్పందించాలని కోరారు. 104 ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి సుబ్రమణ్యం మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బంది కలిగించకుండా, తమ సేవలను ఆపకుండానే తమ సమస్యల పరిష్కారంపై నిరసనలు తెలుపుతున్నామన్నారు. వేతనాలు సక్రమంగా రాక అప్పులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకోవాల్సి వస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం తమ ఇబ్బందులను అర్థం చేసుకుని జీవో 7 ప్రకారం వేతనాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో 104 ఉద్యోగులు సురేష్, కిషోర్ మహబూబ్ పీరా, షబానా తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులు చేపట్టాలి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వం చేపట్టిన పురపాలక, నగరపాలక ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులను షెడ్యూల్ మేరకు నిర్వహించాలని ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు డిమాండ్ చేశారు. అనంతపురం కార్పొరేషన్‌లోని వివిధ పాఠశాలల్లో బుధవారం నాడు ఎస్‌టియు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురపాలక, నగరపాలక ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతుల షెడ్యూల్ ఇదివరకే వచ్చిందన్నారు. ఈ ప్రక్రియ ఆలస్యం లేకుండా మొదలు పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రభాకర్, సురేష్ కుమార్, నర్సింహులు, కృష్ణమూర్తి నాయుడు, వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఎన్‌పిసిఐ తప్పనిసరి

బుక్కరాయసముద్రం : ప్రభుత్వ పథకాలకు సంబంధించిన డబ్బులు బ్యాంకు ఖాతాలో జమ కావాలంటే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఎన్‌పిసిఐ చేయించుకోవాలని ఎంపిడిఒ సల్మాన్‌రాజ్ తెలిపారు. ప్రభుత్వ పథకాలకు అర్హులుగా ఉన్న ప్రతి ఒక్కరూ వారి వ్యక్తిగత ఫోన్‌నెంబర్, ఆధార్ నెంబర్‌ను ఆయా బ్యాంకుల పరిధిలో అందించి ఎన్‌పిసిఐ అనుసంధానాన్ని పూర్తి చేయించుకోవాలన్నారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థికసాయం

అనంతపురం క్రైం : ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇటీవల అనారోగ్యంతో మతి చెందిన హోంగార్డు ఎన్.ఆంజనేయులు కుటుంబానికి రూ.4,32,000 ఆర్థిక సాయాన్ని ఎస్పీ జగదీష్ అందజేశారు. చెక్కు రూపంలో ఈ మొత్తాన్ని బుధవారం నాడు జిల్లా పోలీసు కార్యాలయంలోని ఆంజనేయులు భార్య జయలక్ష్మికి అందించారు. ఉమ్మడి జిల్లా హోంగార్డులు వారి గౌరవ వేతనంలో ఒక రోజు వేతనాన్ని ఈ కుటుంబానికి అందజేయడం అభినందనీయమని ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ అడ్మిన్ డివి.రమణమూర్తి, ఎఆర్ అదనపు ఎస్పీ ఇలియాజ్ బాషా, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్ మధు పాల్గొన్నారు.

వృద్ధురాలిపై అత్యాచారం హేయం

నిందితున్ని కఠినంగా శిక్షించాలి - బాధితురాలికి ఐద్వా, కెవిపిఎస్, సిపిఎం పరామర్శ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఈనెల 9వ తేదీన రామగిరి మండలంలోని ఓ గ్రామంలో 75 ఏళ్ల వృద్ధురాలిపై చోటు చేసుకున్న అత్యాచార ఘటన అత్యంత హేయమైనదని, ఇందుకు పాల్పడిన నిందితున్ని కఠినంగా శిక్షించాలని ఐద్వా, కెవిపిఎస్, సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. అనంతపురం సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధిత వృద్ధ మహిళను ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప సత్యసాయి జిల్లా సిపిఎం కార్యదర్శి ఎం.ఇంతియాజ్‌లు బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 9వ తేదీ రాత్రి 8:30 గంటల సమయంలో నిద్రిస్తున్న వద్ధురాలిపై అదే గ్రామానికి చెందిన ముత్యాలు అనే వ్యక్తి కర్కసత్వానికి పాల్పడ్డాడని తెలిపారు. ఈ ఘటన జరిగి నాలుగు రోజులవుతున్నప్పటికీ నిందితున్ని అరెస్టు చేయడంలో, బాధితురాలికి రక్షణ కల్పించడంలో పోలీసులు, అధికారుల తీరు సరిగా లేదన్నారు. ఇటీవల చిన్న పిల్లలు మొదలుకుని వృద్ధుల వరకు అత్యాచారాలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇలాంటి ఘటనల విషయంలో ప్రకనటలు మాని నిందితులను కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు చంద్రిక, ఫరీదా, సిపిఎం నాయకులు వెంకటేష్, జీవా పాల్గొన్నారు.

హెచ్ఎల్‌సి మరమ్మతులకు రైతుల సహకారం కోరుతాం

హెచ్‌ఎల్సీ కాలువను పరిశీలిస్తున్న జెసి.ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-నార్పల, పుట్లూరు

హెచ్ఎల్‌సి కాలువ మరమ్మతుల కోసం పుట్లూరు నుంచి తుంపెర గ్రామం వరకూ ప్రతి రైతు వద్దకు వెళ్లి జోలెపట్టి విరాళాలు సేకరిస్తామని తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం రైతులతో కలిసి మండలంలోని తుంపెర గ్రామం వద్ద హెచ్ఎల్‌సి డీప్ కట్‌ను పరిశీలించి మాట్లాడారు. పుట్లూరు నుంచి తుంపెర గ్రామం వరకూ ప్రతి రైతు వద్దకు వెళ్లి జోలె పట్టి విరాళాలు సేకరించి హెచ్ఎల్‌సి కాలువ మరమ్మతులు చేయించి చివరి ఆయకట్టు వరకూ సాగునీరు తీసుకెళ్తామని తెలిపారు. జోలె పట్టి ఖచ్చితంగా హెచ్ఎల్‌సి కాలువ మరమ్మత్తులు చేసి తీరుతామన్నారు. సాగు, తాగునీరు లేకుంటే జీవనాధారమే కష్టమన్నారు. భవిష్యత్తులో రాష్ట్రంలో యువతకు వ్యవసాయమే ప్రధాన ఆధారం అవుతుందన్నారు. ఆయన వెంట టిడిపి నాయకులు కోమటికుంట్ల కులశేఖర్‌రెడ్డి, ఎల్‌కె.చెన్నారెడ్డి, బాలాపురం రామచంద్రారెడ్డి, శివనారాయణరెడ్డి, వీరయ్య, పుల్లారెడ్డి, కార్యకర్తలు, రైతులు ఉన్నారు.

ఇన్‌ఛార్జి డిప్యూటీ తహశీల్దార్‌గా మునీంద్ర

ప్రజాశక్తి-యల్లనూరు

యల్లనూరు ఇన్‌ఛార్జి డిప్యూటీ తహశీల్దార్‌గా మునీంద్ర నియమితులయ్యారు. గతంలో ఈయన ఇక్క రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్‌గా విధులు నిర్వహించారు. ప్రస్తుతం ఇన్‌ఛార్జి డిప్యూటీ తహశీల్దార్‌గా రానున్నారు.

పాఠశాలల్లో ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి -అనంతపురం క్రైం

అపార్ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అన్ని పాఠశాలల్లో ఆధార్ సెంటర్లను ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపల్లి విజయ్ భాస్కర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్ వినోద్ కుమార్‌ను బుధవారం కలిసి కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల రికార్డ్, యు - డైస్‌లో వివరాలు ఒకటే ఉన్నప్పటికీ ఆధార్‌లో వివరాలు మరొక విధంగా ఉండడం విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. దీనిని దృష్టిలో ఉంచుకుని పాఠశాలల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు.

నేటి నుంచి సహకార వారోత్సవాలు

ప్రజాశక్తి-అనంతపురం

భారత జాతీయ సహకార యూనియన్ న్యూఢిల్లీ మార్గదర్శకాలతో 71వ అఖిలభారత సహకార వారోత్సవాలను ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు జిల్లాలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ తెలియజేశారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను కలెక్టరేట్ మినీ కన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం నాడు విడుదల చేశారు. వారోత్సవాల్లో భాగంగా 14న సహకారం అంచుత్వ శాఖకొత్త కార్యక్రమాల ద్వారా సహకార ఉద్యమంలో బలోపేతం చేయడం, 15న సహకార సంఘాల్లో నూతన ఆవిష్కరణలు, సాంకేతిక సుపరిపాలన, 16న వ్యవస్థాపకత, ఉపాధి కల్పన, నైపుణ్యాభివద్ధిని పెంపొందించడంలో సహకార సంఘాల పాత్ర, 17న సహకార సంస్థలు వ్యాపార ప్రయోజత సంస్థలుగా రూపాంతరం, 18న సహకార సంఘాల మధ్య సహకారాన్ని పెంపొందించడం, 19న మహిళలు, యువత బలహీన వర్గాల కోసం సహకార సంఘాలు, 20న స్థిరమైన అభివద్ధి లక్ష్యాల సాధన, మెరుగైన ప్రపంచ నిర్మాణంలో సహకార సంస్థల పాత్ర అన్న అంశాలపై కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ ఎ.మలోల, డిసిఒ అరుణ కుమారి, వెల్ఫేర్ డిడి కుష్బు కొఠారి, డిటిడబ్ల్యుఒ రామాంజనేయులు, జిల్లా పరిషత్ సీఈవో వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ సలహాదారు, డిప్యూటీ స్పీకర్‌కు

ఎమ్మెల్యే దగ్గుపాటి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారుడు (మైనార్టీ అఫైర్స్)గా నియమితులైన మాజీ మండలి స్పీకర్‌గా మహమ్మద్ షరీఫ్, డిప్యూటీ స్పీకర్ రాఘురామ కృష్ణంరాజును అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కలిశారు. విజయవాడలో వారిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ, ప్రజల కోసం కష్టపడి పని చేసిన వారికి తెలుగుదేశంలో సముచిత స్థానం లభిస్తుందన్న విషయం వీరి ఎంపికతో మరోసారి రుజువైందని ఎమ్మెల్యే తెలిపారు.

రాఘురామ కృష్ణంరాజుకు ఎమ్మెల్యేల అభినందనలు

ఎస్‌కెయులో ఇంజినీరింగ్, ఎం.ఫార్మసీలో స్పాట్ అడ్మిషన్లకు ఆహ్వానం

ప్రజాశక్తి-అనంతపురం

శ్రీకృష్ణదేవరాయవిశ్వవిద్యాలయం(ఎస్‌కెయు)లో ఫార్మాసుటికల్ సైన్సెస్, ఇంజినీరింగ్ కళాశాలలో ఎపిపిజిఈసెట్-2024 ద్వారా ఎం.ఫార్మసీ, ఎం.టెక్ కోర్సుల్లో ప్రవేశాలు పూర్తయ్యాయి. వాటిలో మిగిలిన ఖాళీ సీట్లను భర్తీ చేయడానికి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ఫార్మసీ, ఇంజినీరింగ్ కళాశాలల ప్రిన్సిపల్స్ జి.సోమశేఖర్, ఆర్.రామచంద్ర బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎం. ఫార్మసీలో ప్రోగ్రాం సీటు కోసం ఈ నెల 15వ తేదీ ఒరిజనల్ సర్టిఫికెట్లతో కళాశాలలో హాజరు కావాలన్నారు. ఎం.టెక్ కోర్సులో ఖాళీ, స్పాన్సర్డ్ కేటగిరీలో సీట్ల భర్తీకి ఈ నెల 16వ తేదీ ఒరిజనల్ సర్టిఫికెట్లతో కళాశాలలో హాజరుకావాలని ప్రిన్సిపల్స్ తెలిపారు. ఎపిపిజిఈ సెట్‌లో క్యాలిఫై అయిన వారు మాత్రమే అర్హులని తెలిపారు.

జాతీయ స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి -అనంతపురం

అనంతపురం అశోక్‌నగర్‌లోని శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని రంగిశెట్టి మనస్విని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన అండర్ 17 టేబుల్ టెన్నిస్ విభాగంలో రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నెల 17 నుంచి 21వ తేదీ వరకు డయు అండ్ డామన్‌లో జరిగే జాతీయ స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో పాల్గొననుంది. ప్రతిభ చాటిన విద్యార్థిని మనస్వినిని పాఠశాల కరస్పాండెంట్ కుసుమ పుల్లారెడ్డి, ప్రిన్సిపాల్ రఘునాథ్ రెడ్డి, డైరెక్టర్ రామకృష్ణారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు కేశవరెడ్డిలు అభినందించారు.

విద్యార్థినిని అభినందిస్తున్న శ్రీసాయి విద్యానికేతన్ కరస్పాండెంట్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

నేడు తహశీల్దార్ కార్యాలయాల వద్ద 'సిపిఎం ప్రజాపోరు' ధర్నాలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రజలు, కార్మికులు, నిరుద్యోగ యువత సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సిపిఎం నగర ఒకటో కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి డిమాండ్ చేశారు. ప్రజాపోరు యాత్రలో భాగంగా సిపిఎం నగర ఒకటో కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని తపోవనం సర్కిల్, సోమనాథ్ నగర్, యువజన కాలనీ, బళ్లారి రోడ్డు ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడుతూ నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, ప్రభుత్వాలు ధరలు అదుపు చేసి ప్రజలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నగర ఒకటో కమిటీ నాయకులు వెంకటనారాయణ, ప్రకాష్, జీవ, వెంకటేశు, లక్ష్మీనారాయణ, ఎర్రిస్వామి, వరలక్ష్మి, కార్యకర్తలు ఇస్మాయిల్, పీరా, నాగరాజు, వన్నూరప్ప, బాబు, గఫూర్ పాల్గొన్నారు.

సిపిఎం చేపట్టిన 'ప్రజాపోరు' కార్యక్రమంలో భాగంగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం గురువారం జిల్లా వ్యాప్తంగా ఆయా మండల కేంద్రాల్లో తహశీల్దార్ కార్యాలయాల ముందు చేపట్టనున్న ధర్నాలను విజయవంతం చేయాలని సిపిఎం నాయకులు పిలుపునిచ్చారు.

ఉరవకొండ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు చేపడుతున్న ధర్నాను విజయవంతం చేయాలని సిపిఎం వజ్రకరూరు మండల కన్వీనర్ విరుపాక్షి పిలుపునిచ్చారు. సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం వజ్రకరూరు మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి కరపత్రాలు పంపిణీ చేశారు. నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వార్థ రాజకీయాల కోసం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తూ నిత్యావసర సరుకుల ధరలు పెంచుతూ పేదల జీవితాలతో చెలగాటం ఆడుతుందన్నారు. ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యుడు ప్రకాష్, సుధాకర్, జన విజ్ఞాన వేదిక నాయకులు మల్లికార్జునస్వామి, హమాలీలు షెక్షావలి, మాబాషా, శాన, రాకెట్ల నాగన్న, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురంలో సిపిఎం ప్రజాపోరు పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆత్మకూరు : ఆత్మకూరులో రైతు సంఘం నాయకులు రాము, సిఐటియు నాయకురాలు జయమ్మ, ఆవాజ్ నాయకులు వలి, లక్ష్మన్న, వెంకటమ్మ, పరమేష్ సిపిఎం ప్రజాపోరు పోస్టర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు చేపట్టనున్న సిపిఎం ప్రజాపోరు ధర్నాను జయప్రదం చేయాలని కోరారు.

శింగనమల : మండలంలోని సలకంచెరువు గ్రామంలో డ్రెయినేజీ సమస్యలను పరిష్కరించాలని సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్ ఆధ్వర్యంలో సచివాలయంలో వినతిపత్రం ఇచ్చారు. సిపిఎం చేపట్టిన ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా బుధవారం సిపిఎం నాయకులు సలకం చెరువు గ్రామంలో పర్యటించారు. భాస్కర్ మాట్లాడుతూ ఎస్సీ కాలనీలో వీధి దీపాలు, సీసీ రోడ్లు, ఆర్డీటీ స్కూల్ వద్ద డ్రెయినేజీ సమస్యలను పరిష్కరించాలన్నారు. రోడ్లకు ఇరువైపులా ముళ్ల పొదలను తొలగించాలని, ఎస్సీ శ్మశానవాటికను చదును చేయించి కంచె, నీళ్ల ట్యాంక్ ఏర్పాటు చేయాలన్నారు. మండలంలోని ప్రజల సమస్యలపై గురువారం శింగనమలలో చేపట్టనున్న 'ప్రజాపోరు' నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సుంకన్న, రామకృష్ణ, కుళ్లాయి స్వామి, రామాంజనే యులు, శ్రీనివాసులు, కొండారెడ్డి, సూర్యప్రకాష్, వెంకట స్వామి, ఆంజనేయులు, లక్ష్మీనారాయణ, ఓబిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి-ఉరవకొండ

జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఆయా శాఖా గ్రంథాలయాల్లో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకూ 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో బుధవారం గ్రంథాలయ అధికారి ప్రతాపరెడ్డి ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్లను ఎంఇఒలు ఈశ్వరప్ప, రమాదేవి విడుదల చేశారు. వారు మాట్లాడుతూ గ్రంథాలయ వారోత్సవాల్లో విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. 14వ తేదీ ప్రారంభ వేడుకలు, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమకారులను స్మరించుట, 17న సెమినార్, 18 వివిధ అంశాల్లో వ్యాసరచన పోటీలు, 19న మహిళా కార్యక్రమం, 20న పోటీల విజేత విద్యార్థులకు బహుమతి ప్రదానోత్సవం ఉంటుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, పాఠకులు, విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

తాడిపత్రి : 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఎంఇఒ కార్యాలయంలో స్థానిక గ్రంథాలయ అధికారి రవికుమార్ నాయుడు ఆధ్వర్యంలో ఎంఇఒలు వై.నాగరాజు, సి.రామ గోవిందరెడ్డి గ్రంథాలయ వారోత్సవాల గోడపత్రికను ఆవిష్కరించారు.

కళ్యాణదుర్గం రూరల్ : గ్రంథాలయ అధికారి హెచ్.శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్థానిక జడ్పీ హైస్కూల్(బాలికల), సరస్వతి విద్యామందిరం ఉపాధ్యాయులు గ్రంథాలయ వారోత్సవాల గోడపత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం వనజ, తిరుమలరావు, ఉపాధ్యాయులు మంజుల, లీలావతి, వివిఎన్.మూర్తి, శైలజ, గ్రంథాలయ సిబ్బంది ఉమామహేశ్వరి, పాల్గొన్నారు.

కణేకల్లు : కణేకల్లులో గురువారం నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు రికార్డ్ అసిస్టెంట్ వన్నూరుస్వామి తెలిపారు.

పెద్దవడుగూరు : 57వ గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయాలని ఎంపీడీవో నరసింహారెడ్డి, ఎంపిపి శ్రీదేవి, జడ్పిటిసి భాస్కరరెడ్డిని శాఖ గ్రంథాలయాధికారి వెంకటేశ్వర్లు కోరారు. అనంతరం గ్రంథాలయ వారోత్సవాల గోడపత్రికలను ఆవిష్కరించారు. ఎంఇఒలు రాముడు, గురు ప్రసాద్, జడ్పీ హైస్కూల్ హెచ్ఎం సుధాకరబాబుతో కలిసి వారోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు కృషిచేయాలని కోరారు.

కళ్యాణదుర్గంలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు

గుత్తి : స్థానిక ఎంఇఒ కార్యాలయంలో గ్రంథాలయ వారోత్సవాల గోడపత్రికలను ఎంఇఒ బి.రవినాయక్, గ్రంథాలయాధికారి హెచ్.రామాంజనేయులు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకూ జరిగే గ్రంథాలయ వారోత్సవాలను విద్యార్థులు, పాఠకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పామిడి : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్‌ను ఎంపిడిఒ తేజోష్ణ, గ్రంథాలయాధికారి వెంకటలక్ష్మి ఆవిష్కరిచారు. అలాగే తహశీల్దార్, ఎంఇఒ, గ్రామ పంచాయతీ కార్యాలయాలు, జడ్పీ హైస్కూల్, టిసి ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాలల్లో పోస్లర్లను ఆవిష్కరించారు. ఆయా రోజుల్లో నిర్వహించే కార్యక్రమాలను వివరించారు.

మంత్రి నిమ్మలను కలిసిన ఎమ్మెల్యే జెసి

ప్రజాశక్తి-తాడిపత్రి

నియోజకవర్గ పరిధిలోని చివరి ఆయకట్టు భూముల వరకూ సాగునీరు అందించేలా త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి బుధవారం అమరావతిలోని సచివాలయంలో రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును కోరారు. ప్రధానంగా పెండేకల్లు రిజర్వాయర్ దిగువన పూర్తికాని కాలువలను త్వరితగతిన పూర్తి చేసేలా చూడాలని కోరారు. ఈ కాలువలు పూర్తయితే పెండేకల్లు మొదలుకొని తాడిపత్రి మండలంలోని బోడాయిపల్లి గ్రామం వరకూ సాగునీరు అందించవచ్చునని మంత్రికి వివరించారు. మంత్రి సానుకూలంగా స్పందిస్తూ వాటికి ఉన్న అడ్డంకులను తొలిగించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కాగా తాడిపత్రి మున్సిపల్ జెసి ప్రభాకర్‌రెడ్డి బుధవారం టిడిపి నాయకులు, అనుచరులతో కలిసి హెచ్ఎల్‌సి సౌత్ కెనాల్‌కి నీరు వచ్చే తుంపెర సెటర్ వద్ద పర్యటించారు. అక్కడ నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న ముళ్లపొదలు, పూడిక తీసేలా చర్యలు తీసుకున్నారు.

మంత్రి నిమ్మల రామానాయుడుతో ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి

జాబ్‌మేళాలో నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులు

32 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడ్ ఏపీ ఛైర్‌పర్సన్ గుణపాటి దీపక్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాలో 32 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీనివాసులు ఓ ప్రకటనలో తెలిపారు. కంపెనీల ప్రతినిధులు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపికైన వారికి నియామక ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వి.ప్రతాపరెడ్డి, సీడ్ ఏపీ జెడిఎం. మెకానికల్ హెచ్ఒడి సోమ్లానాయక్, ఎపి ఎస్ఎస్ డిపి ప్లేస్మెంట్ ఆఫీసర్ మహేష్, కోఆర్డినేటర్ రాము, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

డిసెంబర్ 13, 14న మెగాజాబ్‌మేళా

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆధ్వర్యంలో డిసెంబర్ 13, 14తేదీల్లో పట్టణంలో మెగాజాబ్‌మేళా నిర్వహిస్తామని టిడిపి ప్రజావేదిక ప్రతినిధి తెలిపారు. 5వ తరగతి నుంచి, డిగ్రీ, బి.టెక్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసిన వారు కళ్యాణదుర్గం ప్రజా వేదికలో సంప్రదించాలన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలి

ప్రజాశక్తి-శింగనమల

గ్రామ పంచాయతీల అభివృద్ధికి సమగ్రమైన ప్రణాళికలు తయారు చేయాలని జిల్లా పరిషత్ సిఇఒ వెంకటసుబ్బయ్య సూచించారు. 'గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు 2025-26' అంశంపై బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జడ్పీ సిఇఒ మాట్లాడుతూ పంచాయతీల పరిధిలోని మహిళలు, విద్య, వైద్యం, యువత, విద్యార్థులు, రైతులు, కూలీలను అందరినీ దృష్టిలో ఉంచుకొని పక్కాగా ప్రణాళికలు తయారు చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న నిధులను ఏ విధంగా సద్వినియోగం చేసుకోవాలో వివరించారు. విడుదలైన నిధులను అభివృద్ధి పనులకు వాడకపోతే భవిష్యత్తులో ఆయా గ్రామ పంచాయతీల్లో అభివృద్ధికి ఆస్కారం ఉండదన్నారు. గ్రామ పంచాయతీల్లో ముఖ్యమైన పనులను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నిర్మల కుమారి, ఇఒఆర్‌డి వెంకటలక్ష్మి, శింగనమల సర్పంచి నాగమునెమ్మ, వైస్ ఎంపిపి విజయ, సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యద ర్శులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి డిఆర్‌డిఎ పిడి ఈశ్వరయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ సామజిక న్యాయం, ఆర్థిక అభివృద్ధి, గ్రామపంచాయతీ అభివృద్ధికి ప్రణాళికల తయారీ, తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపిపి హేమలత, ఎంపిడిఒ జి.లక్ష్మీనర సింహ, వైస్ ఎంపిపి విజయకుమార్ నాయక్, రీసోర్స్ పర్సన్లు మహబూబ్‌బాషా, మల్లేష్, ప్రభాకర్, మానస, కాత్యాయని పాల్గొన్నారు.

నార్పల : 'గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు 2025-26' అంశంపై స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపిడిఒ గంగావతి ఆధ్వర్యంలో ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శు లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ శైలజరాణి, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు..

పుట్లూరు : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపిడిఒ అలివేలమ్మ ఆధ్వర్యంలో ఎంపీటీసీలు సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఇఒఆర్‌డి జిలాన్‌బాషా, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు..

ఆత్మకూరులో కార్యక్రమంలో మాట్లాడుతున్న డిఆర్‌డిఎ పిడి ఈశ్వరయ్య

గుత్తి : మండలంలోని గ్రామ పంచాయతీల అభివృద్ధికి పాటుపడదామని ఎంపిపి జి.విశాలాక్షి, ఎంపిడిఒ డి.ప్రభాకర్ తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, వివో లీడర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామపంచాయతీల్లో అభివృద్ధికి ప్రణాళికలు రూపొం దించాలని, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ శివాజీరెడ్డి, ఏవో ముస్తాక్ అహ్మద్, ఎపిఎం అరుణ, తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో సల్మాన్‌రాజ్ ఆధ్వర్యంలో ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న నిధులను ప్రణాళిక బద్ధంగా ఖర్చు చేసి గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి దాసరి సునీత, ఈవోఆర్‌డి సదాశివం, ఎపిఎం నారాయణస్వామి, ఏపీవో పోలేరయ్య పాల్గొన్నారు.

యల్లనూరు : గ్రామాల అభివద్ధికి సంబంధించి మండలంలోని సర్పంచులు, ఎంపిటిసిలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిపి గంగాదేవి అధ్యక్షతన ఎంపిడిఒ వాసుదేవరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి భోగతి విజయప్రతాప్ రెడ్డి, ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థుల వితరణ

ప్రజాశక్తి-బెళుగుప్ప

స్థానిక జడ్పీ హైస్కూల్‌లో 1995-96 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు బుధవారం అదే పాఠశాలలో సమావేశమయ్యారు. వారు 'బడి రుణం తీర్చుకుందాం' కార్యక్రమంలో భాగంగా రూ. 45 వేల చేసే మానిటర్, సిపియు, ప్రింటర్, తదితర వస్తువులను అందజేశారు. ఎంఇఒ పి.మల్లారెడ్డి, హెచ్ఎం ఎం.వెంకటప్రసాద్, ఎస్ఎంసి ఛైర్మన్ రుద్రయ్య పూర్వ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గంగాధర్, బాలాజీ, ప్రకాష్‌రెడ్డి, శివ, అల్లా బకాష్, శైలజ, ఉమామహేశ్వరి, తిమ్మారెడ్డి, హరి, వెంకటరాముడు, అర్జున్, రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు

కంప్యూటర్ తదితర వస్తువులను అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

స్థానికేతరులను ఆర్‌పిగా నియమించొద్దు

ప్రజాశక్తి-గుత్తి

మెప్మా నిబంధనల మేరకు ఎంపిక చేసిన మహిళను కాదని స్థానికేతురాలైన మహిళను ఆర్‌పిగా నియమించరాదని డిమాండ్ చేస్తూ బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద మహిళా సంఘాల సభ్యులు ధర్నా చేపట్టారు. మెప్మా సిఎన్ఎన్ శ్రీనివాసరెడ్డి, సిఒలు చంద్రశేఖర్, సురేఖ లతో మహిళా సంఘాల సభ్యులు వాదనకు దిగారు. సంఘాల సభ్యులు ఎంపిక చేసిన మహిళనే ఆర్‌పిగా నియమించాలని లేనిచో కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్‌మియాకు వినతి పత్రం అందజేశారు.

ఎమ్మెల్యేను కలిసిన మండల నాయకులు

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా తాగునీరు, డ్రెయినేజీ, తదితర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల టిడిపి నాయకులు బుధవారం అమరావతిలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్‌ను కలిసి విన్నవించారు. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చేపట్టిన మిడ్ పెన్నార్ ప్రాజెక్టు పనులను పూర్తి చేయించాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో టిడిపి పట్టణ అధ్యక్షులు ఎంకె.చౌదరి, నాయకులు సి.లక్ష్మణ్‌చౌదరి, ఆర్.సాల్మన్‌రాజా, సర్పంచి యు.రామలింగమయ్య, జక్కలచెరువు ప్రతాప్, న్యాయవాది సోము, చికెన్ శీన, బి.రమేష్, మల్లికార్జున ఉన్నారు.

ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్‌ను కలిసిన గుత్తి టిడిపి మండల నాయకులు

స్కేటింగ్ క్రీడాకారులకు ఎంపి అభినందనలు

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

నగరంలోని ఎంపి కార్యాలయంలో బుధవారం ఎంపి అంబికా లక్ష్మీనారాయణ జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. ఇటీవల కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులు పద్మావతి, హీన, హంజా హుస్సేన్, కాకర్ల హనీష్‌కుమార్, ప్రీతి, స్పెషల్ క్యాటగిరీలో సుజిత్ హార్దిక్, హేమంత్‌లకు ఎంపి స్వీట్స్ తినిపించి అభినందించారు. వీరికి తన వంతు పూర్తి సహాయ, సహకారాలు అందిస్తానని తెలిపారు. అలాగే కోచ్‌లు నాగేంద్రకుమార్, అంజి, అనిల్, కార్యదర్శులు రవిబాల, అనిల్ కుమార్‌ను ఎంపి అభినందించారు.

ఎస్ఆర్ఐటి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-శింగనమల

ఈ నెల 8వ తేదీ కర్నూలులోని జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన హ్యాకథాన్‌లో ఎస్ఆర్ఐటి ఇంజినీరింగ్ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఫైనల్ ఇయర్ సిఎస్ఇ విద్యార్థులు నరేంద్ర, ధనలక్ష్మి, శ్రీనిత్య(సిఎస్‌డి), రామకృష్ణ(సిఎస్ఎం) రూ. 10వేల చొప్పున కన్సొలేషన్ బహుమతులు అందుకున్నారు. వారిని కరెస్పాండంట్ ఆలూరు సాంబశివరెడ్డి, ప్రిన్సిపల్ డా. జి.బాలకృష్ణ, టిపిఒ డా. ఎం.రంజిత్‌రెడ్డి, విభాగాధిపతులు డా. పి.చిత్రలింగప్ప, పి.వీరప్రకాష్, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్లు కొండన్న, వై.విజయ్‌భాస్కర్, అధ్యాపకులు అభినందించారు.

కంది, పత్తిలో అధిక దిగుబడులపై అవగాహన

ప్రజాశక్తి- పెద్దవడుగూరు

ప్రస్తుతం సాగు చేసిన పత్తి, కంది పంటల్లో అధిక దిగుబడులు పొందేందుకు బుధవారం స్థానిక రైతుసేవాకేంద్రంలలో శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. కృషివిజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ కిషోర్, పత్తిపరిశోధన సంస్థ నోడల్ అధికారిణి వలర్మతి, ఏవో మల్లేశ్వరి, విస్తరణ అధికారిణి సునీత, రజనీ తదితరులు పాల్గొన్నారు. వారు పత్తిలో అధిక సాంద్రత, సాగుపద్ధతిపై రైతులు దృష్టిపెట్టాలని సూచించారు. ఈ పద్ధతిలో సాగు చేయడం వల్ల వచ్చే లాభాలు, గులాబీరంగు పురుగు నుంచి పంటను కాపాడుకునేందుకు తగు సూచనలు అందించారు. అనంతరం పెద్దవడుగూరు, కొట్టాలపల్లి, చిన్నవడుగూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి పత్తిపంటలను పరిశీలించారు.

పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

వైసిపి నియోజవర్గ ఇన్‌ఛార్జిపై అసత్య ప్రచారం తగదు

ప్రజాశక్తి-కుందుర్పి

కళ్యాణదుర్గం నియోజవర్గ వైసిపి ఇన్‌ఛార్జి తలారి రంగయ్యపై అసత్యప్రచారం చేయడం తగదని ఆ పార్టీ మండల కన్వీనర్ సత్యనారాయణశాస్త్రి, జడ్పిటిసి రాధాస్వామి, సీనియర్ నాయకుడు సుదర్శన్‌రెడ్డి, సింగల్ విండో ఛైర్మన్ వన్నూర్ రెడ్డి, మార్కెట్‌యార్డ్ డైరెక్టర్ లింగప్ప తెలిపారు. కుందుర్పిలో బుధవారం వారు మండల కన్వీనర్ నివాసం ఆవరణలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇన్‌ఛార్జి తలారి రంగయ్య నియోజకవర్గంలోని అన్ని మండలాల ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచులు మారుతీశ్వరీరామ్మూర్తి, గంగాధర, విజయ్‌కుమార్, హసీనాబీఅతావుల్లా, ఎంపిటిసి గంగమ్మహనుమంతరాయుడు, పాలాక్షి పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతగా వ్యవహరించాలి

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

గ్రామాల అభివృద్ధి కోసం అన్ని శాఖల అధికారులు బాధ్యతగా పని చేయాలని డిఎల్‌డిఒ విజయలక్ష్మి సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో వాల్మీకి కవిత మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు ప్రజల సమస్యలు తెలుసుకుని అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి శ్రీకాంత్ చౌదరి, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'సాయివిజ్ఞాన్'లో దంత వైద్య శిబిరం

అనంతపురం : నగరంలోని మూడో రోడ్డులో ఉన్న సాయి విజ్ఞాన్ పాఠశాలలో బుధవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో ప్రముఖ దంత వైద్యనిపుణులు డాక్టర్ కె.అరుణ గారు విద్యార్థులకు దంత సంరక్షణపై సలహాలు, సూచనలు చేశారు. అలాగే టూత్ పేస్టు, టూత్ బ్రష్ పంపిణీ చేశారు. పాఠశాల డైరెక్టర్లు ఎంపి.శ్రీనివాసులు, సి.కరుణాకర్‌బాబు, హెచ్ఎం జి.లావణ్య తెలిపారు.

సాగునీటి సంఘాల ఎన్నికపై సమావేశం

కళ్యాణదుర్గం రూరల్ : పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో బుధవారం ఆర్డీవో వసంతబాబు సాగునీటి సంఘాల ఎన్నికల విషయమై డివిజన్ పరిధిలోని తహశీల్దార్లు, రాయదుర్గం, కళ్యాణదుర్గం ఇరిగేషన్ డిఇ, ఎఇలు, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రెవెన్యూ అంశాలపై సమీక్ష నిర్వహించారు.

డిఇఒను కలిసిన ఎపిటిఎఫ్ నాయకులు

అనంతపురం : నూతన డిఇఒ ప్రసాద్‌బాబును బుధవారం ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పాతిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు మోహన్‌రెడ్డి, తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కలిసిన వారిలో ఉపాధ్యాయ సంపాదకులు నరేష్, గురురాజు, సాంబశివరెడ్డి సూర్యనారాయణ, లక్ష్మన్న, ఎల్లప్ప, ఈశ్వరయ్య, ప్రభాకర్, మదన్, శివారెడ్డి, రాధాకృష్ణ, చంద్రరాజు, గోవర్ధన, వెంకటేశులు, శ్రీనివాసులు, మోహన్, రాజు, నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

16న మాదిగల ఆత్మీయసభ

అనంతపురం : ఈ నెల 16వ తేదీ నగరంలోని ఎల్‌కెపిలో జరిగే ఉమ్మడి అనంతపురం జిల్లా మాదిగల ఆత్మీయ సదస్సుకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ హాజరవుతారని, ఆ సదస్సును జయప్రదం చేయాలని మాదిగ ఉద్యోగుల సమైక్య రాష్ట్రఉపాధ్యక్షులు యల్లప్పగారి గంగాధర్ పిలుపునిచ్చారు.

వైభవంగా వరసిద్ధి వినాయక ధ్వజస్తంభ ప్రతిష్టాపన

బెళుగుప్ప : శ్రీవరసిద్ధి వినాయక ధ్వజస్తంభం ప్రతిష్టాపన కార్యక్రమాల్లో భాగంగా నాల్గో రోజైన బుధవారం మలయాళ వేద పండితులు బ్రహ్మశ్రీ శ్రీరంగం సరున్మోహన్ తంత్రి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రాణాంగంలో ఉదయం గణపతి హోమం, ధ్వజ స్తంభానికి విశేష పూజలు (పున:ప్రతిష్ట) నిర్వహించారు.

పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగునకు చర్యలు

అనంతపురం : పంచాయతీల్లో దోమలు, వ్యాధులు ప్రభలకుండా పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని రుద్రంపేట, కక్కలపల్లి కాలనీ పంచాయతీల కార్యదర్శి యు.హిదయతుల్లా సిబ్బందిని ఆదేశించారు. దోమలు ప్రబలకుండా బుధవారం కక్కలపల్లి కాలనీలో ఫాగింగ్ కార్యక్రమం చేపట్టారు. డ్రెయినేజీలు, వీధుల్లో ఎప్పటికపుడు కాలువలు శుభ్రం చేసేలా చర్యలు చేపడతామని కార్యదర్శి తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు చేయిస్తున్న కార్యదర్శి హిదయతుల్లా

చోరీ కేసులో నిందితునికి ఏడాది జైలు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

తాళాలు వేసిన ఇంటికి తాళాలు పగలగొట్టి దొంగతనాలకు పాల్పడిన కేసులో నిందితునికి ఏడాది జైలు శిక్ష పడినట్లు సిఐ కరుణాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది ఆగస్టు 9వ తేదీన కొత్తపల్లి గ్రామంలో రెండు ఇళ్లల్లో దొంగతనం జరిగిందన్నారు. ఈ కేసులో నిందితుడు నార్పల మండలం చింతవనం కొట్టాలకు చెందిన బుస్సే సుభాష్‌ను అరెస్టు చేసినట్లు చెప్పారు. నితనిపై నేరం రుజువు కావడంతో స్పెషల్ మొబైల్ కోర్ట్ మేజిస్ట్రేట్ జె.సుజిన్ కుమార్ అతనికి ఏడాదికి జైలు విధిస్తూ తీర్పు వెలువరించారన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-అనంతపురం

రెవెన్యూ, విజిలెన్స్ అధికారులు కలిసి బుధవారం రాప్తాడు మండలంలోని మరూరు టోల్‌ప్లాజా వద్ద హైవే పక్కన వాహనాల తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో కర్నాటకలోని బంగారుపేటకు అక్రమంగా రవాణా చేస్తున్న 261 కిలోల రేషన్ బియ్యంతో పాటు ఓ లారీని స్వాధీనం చేసుకుని రాప్తాడు సిఎస్‌డికి అప్పగించారు. అలాగే డోన్ పట్టణానికి చెందిన లారీ డ్రైవర్ కె.శ్రీనివాసులు, లారీ ఓనర్ మౌలాలి, కర్నూలు నగరంలోని భాస్కర్ నగర్‌కు చెందిన దిలీప్, మహాలక్ష్మి ట్రేడర్స్ రైస్ మిల్లు యజమానిపై క్రిమినల్ కేసు నమోదు చేయించినట్లు తెలిపారు. తనిఖీల్లో అధికారులు సిఐ ఎస్.జమాల్‌బాషా, డిసిటిఒ బి.సురేష, సిఎస్‌డిటి సి.జ్యోతి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

దాడి చేసిన వ్యక్తులు అరెస్టు

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో నరసింహపై దాడి చేసి గాయపరిచిన కేసులో బుధవారం ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపాడు. అదే గ్రామానికి చెందిన పెద్ద ఓబులేసు, చిన్నఓబులేసు, ఓబయ్య, ఓబుళపతి, ఠాగూర్, మధులను క్రిష్టిపాడులో అరెస్టు చేసి రిమాండ్ పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

ట్రాక్టర్ చోరీ కేసులో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

ట్రాక్టర్ చోరీ కేసులో బుధవారం పోలీసులు ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి రూ. 4.3 లక్షల విలువ చేసే ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. కళ్యాణదుర్గం డీఎస్పీ పర్యవేక్షణలో రూరల్ సిఐ సి.నీలకంఠేశ్వర, కంబదూరు ఎస్ఐ ఓబుళపతి, హెడ్ కానిస్టేబుల్ జాఫర్ నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం 10 గంటల సమయంలో కంబదూరు మండలంలోని అండేపల్లి గ్రామ సమీపంలో దేవరమానుల వద్ద నిందితులను అరెస్టు చేశారు. నిందితులను కంబదూరులోని గుండ్లపల్లి కాలనీకి చెందిన మచ్చిపల్లి విజయసింహా, ఎస్సీ కాలనీకి చెందిన కెబి.గంగాధర్‌గా గుర్తించారు.

పారిశుధ్య కార్మికులకు బూట్లు పంపిణీ

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని 1వ సర్కిల్‌లోని 14 సచివాలయాల్లో పని చేసే 150 మంది పారిశుధ్య కార్మికులకు బుధవారం డిస్కవర్ అనంతపురం అనిల్‌కుమార్ హై క్వాలిటీ గంబూట్స్ పంపిణీ చేశారు. అనిల్‌కుమార్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులను కాపాడుకోవడం నగరంలోని ప్రతి పౌరుని బాధ్యత అన్నారు. సుమారు రూ. లక్ష ఖర్చు చేసి ముంబయి నుంచి బూట్లు తెప్పించినట్లు తెలిపారు.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE'S COURT : GOOTY
E.P.16/2022 in O.S.64/2017

Between:
S.Basha ...Petitioner/D.Hr
V/s
S.K.Ramesh Babu
S.K.Radhamma ...Respondents/J.drs
To.
1.S.K.Ramesh Babu, S/o.Late K.Laleppa, D.No.1/18-61J, Near Dhatthatreya Swamy Temple, Near Bye Pass Road, Pamidi-515 775.
2.S.K.Radhamma, W/o.S.K.Ramesh Babu, D.No.1/18-61J, Near Dhatthatreya Swamy Temple, Near Bye Pass Road, Pamidi - 515 775.

వేలం నోటీసు

పై దావాలో ప్రతివాదికి చెందిన బాకీ బాపతు మొత్తాన్ని రాబట్టుటకుగాను, దిగువ తెలిపిన ప్రతివాదికి చెందిన ఆస్తిని పై కోర్టులో కోర్టు వారి ఎదుట **02-12-2024** తేదిలో ఉదయం 10.30 ని.వేలము వేయుటకు వాయిదాగా వేసినారు. కావునా వేలములో పాల్గొను వారు పై తెలిపిన కోర్టు వారి ఎదుట హాజరై వేలములో పాల్గొనవలసినదిగా తీర్మానము చేసినారని యిందుమూలముగా తెలపడమైనది.

SCHEDULE

House Property bearing D.No.1-18-61J, Situated near Dhatrateya Swamy Temple, near Bye pass road, Pamidi Town and Mandal R.D. of Anantapur, S.R.D. of Pamidi with the following full particulars and boundaries :-

Babu	Sy.No.	Extent
Govt. Dry	912	Ac.0-94 Cents Paiki Plot No.16

Boundaries :-
East : 20 feet Road in Northern side and 13 feet Road in Southern Side
West : Plot No.15, **North:** 20 Feet Road
South: Waste Channel Situated in Sy. No.897
Measurements :- East - West :- 33 Feet or 10.065 metes (Northern Side).
North-South:- 48 Feer or 14.64 meters (Eastern Side). North-South:- 41 Feet of 12.50 meters (Western side) or 1312.75 Sq. Feet or 145.86 Sq.Yards.
Ameena Value of the property :- Rs.30,00,000/-

కే.మనోహర్‌బాబు మరియు పి.ఓబులేసు,
D.Hr పరం పకీళ్ళు